# అతిథి

చీకటి తెరలు లోకంపైకి జారుకుంటున్న అపరసంజ వేళ ఊరికి కూతవేటు దూరంలో, రోడ్డు ప్రక్కన చింతచెట్టు క్రింద నిల్చుని సిగరెట్టు కాల్చుకుంటూ ఆకసంవైపు చూస్తున్న శేఖరాన్ని సమీపించి, ఓ అపరిచితుడు 'ఈవూళ్ళో పడుకోడానికి తావు దొరుకుతుందా సార్' అని దీనంగా ప్రశ్నించాడు.

ఆ ప్రశ్న తాకిడికి శేఖరంలో ఆశ్చర్యమూ, అనుకంపా, అనుమానము-వరుసగా ఈమూడు భావాలూ ముప్పిరి వేసుకపోయాయి. ఇంత వూళ్ళో పడుకోడానికే తావుదొరకదా? ఏవసారాలోనో నడుము వాల్చితే సరిపోయే దానికి ఇతనికింత దీనంగా ఎందుకు ప్రాధేయపడవలసి వచ్చింది అన్న ఆశ్చర్యంతోనూ

కుర్రాడెవరో గానీ చూడ్డానికి బాగానే వున్నాడు. దుస్తులు మాసిపోయివున్న మాట నిజమే. క్రాపింగు చెదరిపోయివున్న మాటా సత్యమే, గడ్డం పెరిగివున్న మాటగూడా యథార్థమే. కాని శుభ్రంగా గడ్డం గీక్కుని, వుతికిన దుస్తులు వేసుకుని, తల దువ్వుకున్నట్టయితే యితడప్పుడే కాలేజి మెట్లు దిగుతున్న నవనాగరిక యువకుడిలా కనుపించకపోడు; ఇలాటి వాడికా పడుకోడానికింత చోటు చూపించమని బ్రతిమాలుకోవలసిన దుర్దశ, అన్న అనుకంపతోనూ-

ఏమిటో మరి! ఇతని వాలకమంతా అదోలావుంది. 'ముఖం పద్మ దళాకారం, వాచాచందన శీతలం...' అంటూ పెద్దలు ధూర్తుని లక్షణాలు పేర్కొన్నారు. ఏ పుట్టలో ఏ పాముంటుందో ఎవరు చెప్పగలరు? ఇలాటి వాళ్ళెంతకైనా తెగుదురు. నమ్మి పడుకోబెడితే యితగాడు చేతికి దొరికింది తీసుకుని రాత్రికి రాత్రే కాలికి బుద్ధిచెపితే, అన్న అనుమానంతోనూ- ఏం చెప్పడానికీ తోచక శేఖరం యింకా ఆలోచిస్తూ వుండగానే 'అరుగు చూపించినా చాలండీ! తెల్లవారగానే లేచి వెళ్ళిపోతాను' అంటూ ఆ అపరిచితుడు మళ్ళీ ఒకసారి బ్రతిమాలుకున్నాడు.

ఈ మాటలతో ఆలోచనలోనుంచి తేరుకున్న శేఖరం మసకచీకట్లో ఆగంతకుని ముఖాన్ని తీక్షణంగా పరిశీలిస్తూ 'మీదేవూరు?' అని ప్రశ్నించాడు.

'మాది రామాపురం సార్! ఇలా కొత్తపేట వెళ్తున్నాను.'

'ఎక్కడి రామాపురం! ఎక్కడి కొత్తపేట! బస్సులో వెళ్ళలేకపోయారా?'

'వెళ్ళేవాడినే గానీ...' అభిమానం అడ్డు తగిలింది కాబోలు, వాక్యం మధ్యలోనే ఆగిపోయింది.

ఎదుటివాడి పరిస్థితిని అర్థంచేసుకోగల్గిన శేఖరం 'ఐతే ఏంచేద్దాం మరి! అలాగే రేపుదయం వెళ్దరుగానీ నాతో రండి' అంటూ ముందుకు దారితీశాడు.

అప్పటికి యింట్లో వంటలు పూర్తయ్యాయి.

శేఖరం అపరిచితుణ్ణి అరుగుమీద కూచోబెట్టి లోపలికి వెళ్ళే సరికి రాజేశ్వరి చంటివాడికి పాలిస్తోంది.

కామాక్షమ్మ కళ్ళద్దాలలోంచి చూస్తూ విస్తర్లు కుడుతోంది. శారద దీపం దగ్గర కూర్చుని వారపత్రిక చదువుకుంటోంది.

'ఇదిగో రాజేశ్వరీ! ఒక్కమాట' అన్నాడు శేఖరం.

'ఏమిటండీ' అంది రాజేశ్వరి.

'మనింట్లో మనం నలుగురమున్నాముగదా అని నువ్వు నలుగురికి మాత్రమే వంటచేసి పెట్టావు. కానీ వేళకు సరిగ్గా ఓ అతిథి వచ్చేస్తాడనుకో, వండిన అన్నాన్ని అయిదుమందికి సర్దిపెట్టడానికి వీలవుతుందా?' అడ్డ తిరుగుడుగా అడిగాడు శేఖరం.

'ఇప్పుడెవరైనావచ్చి పడ్డారేమిటి?'

అవునన్నట్టు శేఖరం తలవూపాడు.

'ఎవరండీ ఆ మనిషి?' - రాజేశ్వరి ప్రశ్న. 'తెలియదు'

'తెలియక పోతేనేం రాజేశ్వరీ! మనంతినే అన్నం అతడికీ కాస్తా పెట్టేస్తే సరిపోతుంది' అంటూ కామాక్షమ్మ యిక్కడ కలుగచేసుకుంది.

'ఐతే బాబును శారద చేతికిచ్చి నువ్వు పీటలువెయ్ రాజేశ్వరీ! నేనతణ్ణి పిలుస్తాను' అంటూ పైకిలేచాడు శేఖరం.

రాజేశ్వరి పీటలూ, విస్తర్లూ వేసింది. శేఖరం వసారా లోకివెళ్ళి అప్పుడే "పడుకున్నారేమిటి? భోంచేద్దురుగానీ లేవండి' అన్నాడు.

'భోజనమా! అబ్బే, అవసరం లేదండీ' అన్నాడు. అపరిచితుడు, కాకపోతే అతిథి.

'తప్పు, తప్పు. మానవుడికి భోజనంతోనే అవసరం లేకపోవడమేమిటి? లేవండి. ఏదో మాకున్నది కలోగంజో...'

'సరే, మీరలాగంటే నేనేం చెప్పగలను?' అంటూ అతడు శేఖరాన్ని వెంబడించాడు.

వడ్డన ప్రారంభదశలోనే వుండగా యింకా అక్కడే కూర్చుని విస్తర్లు కుడుతున్న కామాక్షమ్మ అతిథిని కాసేపు పరీక్షగా చూచి 'నీకు పెళ్ళయిందా నాయనా?' అంది.

'అబ్బే, యింకా లేదండీ!' అన్నాడతడు, కాస్త సిగ్గుపడుతూ.

'పాతికేళ్ళు మీరినట్టున్నాయి. ఇంకా పెళ్ళి కాకపోవడమేమిటి బాబూ! మీకేం మహారాజులు! పెళ్ళి సంగతి పట్టించుకోకున్నా మీకు కాలం గడిచిపోతుంది. ఆడకూతుళ్ళను యింట్లో వుంచుకున్న మాబోటి వాళ్ళ సంగతి చెప్పు.'

'ఊరుకోవమ్మా! ఎప్పుడు చూచినా నీగొడవే నీది!' విసుక్కుంటూ తల్లికి అడ్డు తగిలాడు శేఖరం.

'చూడుబాబూ! నేను పెదవి కదిపితే వీడిలా తారాచువ్వలా పైకిలేస్తాడు' అతిథినే మధ్యవర్తిగా చేసుకుని కుమారుడిపైన నేరం ఆరోపింపసాగింది కామాక్షమ్మ. "ఆడబిడ్డంటే ఏమన్నమాట! ఆ బరువును వదలించుకుంటేగానీ నిద్రపడుతుందా నాయనా!'

'అవునమ్మా అవును' కామాక్షమ్మ పాటకు అతిథి తాళంవేశాడు.

ఆ ఆసరాతో కొంచెం ధైర్యం చేకూర్చుకున్న కామాక్షమ్మ "ఆ పీలేరు వాళ్ళు ఉత్తరమేమైనా వ్రాశారా శేఖరం" అంది. 'లేదు' అన్నాడు ముక్తసరిగా శేఖరం.

'పీలేరువాళ్ళా! పీలేరులో ఎవరండి' అన్నాడు అతిథి.

అసలీ ప్రసంగమంతా శేఖరానికేమంత ఆమోదకరంగా సాగడంలేదు. ఐనా అతడు తప్పించుకోడానికి వీల్లేక 'ఉన్నారులెండి! శ్రీపురం సుబ్బరామయ్యగారని...' అని నసిగాడు.

'శ్రీపురం సుబ్బరామయ్యగారా! రామాలయం వీధిలో నాలుగో యిల్లే గదండి!'

'అవునవును, ఆయనగారు మీకు తెలుసునేమిటి?' అన్నాడు శేఖరం.

'తెలియడమేమిటండీ! నేనాయింట్లో నాలుగేళ్ళుండి చదువుకున్నవాడినైతే! సుబ్బరామయ్యగారు మా నాన్నగారికి ప్రాణస్నేహితులు. అందు మూలాన హోటల్లో వుంచితే చెడిపోగలననీ, నన్ను సుబ్బరామయ్యగారి యింట్లో వుంచి చదివించారు.'

'అలాగా! నీ కాకుటుంబాన్ని గురించి బాగా తెలుసన్నమాట!'

'మెల్లగా అడుగుతున్నారా! సుబ్బరామయ్యగారు అపర దుర్వాసులు, అయితే ఆ కోపం క్షణికమేలెండి! ఇక ఆయన భార్య సుందరమ్మ వుందంటే నోట్లో నాలుకలేని యిల్లాలు. వంటలూ వార్పులూ తప్పితే ఆమెకు మరొక సంగతి తెలియదు. ఇక శ్రీధరమున్నాడనుకోండి...'

'కుర్రాడు నెమ్మదైనవాడేనా బాబూ!' ఆతురతగా అడిగింది కామాక్షమ్మ.

'ఆ విషయం నేను చెప్పగూడదండీ!' వినయంగా అన్నాడు అతిథి.

'అదేమిటి బాబూ!' విస్తుపోయింది కామాక్షమ్మ.

'ఎందుకంటే వాడు నాకు ప్రాణమిత్రుడు'.

'అది కాదు నాయనా! అతణ్ణి గురించి చాలా చిత్రమైన కబుర్లు వింటున్నాము. అదేదో కంపెనీలో పనిచేస్తూ మేనేజరుగారికి తనకూ అభిప్రాయ భేదంవచ్చి రాజీనామా యిచ్చేశాడనీ, అక్కచెల్లెలి పెళ్ళిలో అటువైపు వాళ్ళు లేనిపోని హోదాలకు పోతే ఈ పెళ్ళి జరగడానికి వీల్లేదని భీష్మించుక కూచున్నాడనీ...'

'అవునండీ! వాడు కాస్తా చిత్రమైన మనిషే! ఒప్పుకోక తప్పదు!'

'అసలు వాళ్ల కథంతా చిత్రంగానేవుందీ. ఏదో దూరపు బంధుత్వాన్ని పురస్కరించుకుని సుబ్బరామయ్యగారు మాత్రం ఒకసారి యిక్కడికి వచ్చి వెళ్లారనుకోండి. వెళ్లిందే "మీతో సంబంధం కలుపుకోవలెనని కోరుతున్నాను" అని జాబు వ్రాశారు. ఈ కథ జరిగాక నిండుగా ఒక్క సంవత్సరమైంది. వేసిన గొంగళి వేసిన చోటనేవుంది" అన్నాడు శేఖరం.

'పెళ్ళి అన్న తర్వాత నిమ్మకు నీరెత్తినట్టుగా యిలా చల్లగావుండిపోతే ఎలా జరుగుతుంది? ఒకటి రెండుసార్లు వాళ్లూ రావాలి. మనమూపోవాలి. కట్నాలు, కానుకలు కుదుర్చుకోవాలి. అన్నింటికంటే ముఖ్యం, అబ్బాయికి అమ్మాయికి నచ్చాలి...' కామాక్షమ్మ ఉపన్యాసం యిప్పుడిప్పుడే ఆగిపోయే సూచనలు లేవు.

'అమ్మా, అమ్మా' లోపలనుంచి శారద తల్లిని పిలిచింది.

'చూశావా నాయనా! అమ్మాయికి పెళ్ళి సంగతంటే అసలు సరిపడదు. ఈ విషయంలో అన్నా చెల్లెళ్ల ఒకటి. మేమత్తా కోడళ్లము ఒకటి' అంది కామాక్షమ్మ.

భోజనాలైన తర్వాత అతిథి యింట్లోనే హాలుకు తూర్పువైపున వున్న కచేరీ గదిలో పడుకోడానికి ఏర్పాటు జరిగింది. కాసేపు పిచ్చాపాటీ మాటాడిన తర్వాత శేఖరం లోపలికి వెళ్లిపోయాడు. బాబును నిద్రపుచ్చడానికోసం శారద పాడుతున్న జోలపాటను వింటూ అతిథి నిద్రాదేవత కౌగిట్లోకి జారిపోయాడు.

◆ ◆ ◆

ఇంకా తెల్లవారలేదు. కళ్ళు నులుముకుంటూ శేఖరం లేచివచ్చి తలుపు గడియ తీయబోయాడు. అదప్పటికే తెరచి వుంది. శేఖరం ఆదరాబాదరా కచేరీ గదిదగ్గరకు వెళ్ళాడు. గదిలో అతిథి లేడు!

ఎందుకైనా మంచిదని శేఖరం యింటిలో నలుమూలలా కలయతిరిగి ఎక్కడి వస్తువులు అక్కడున్నాయా, లేదా అని తనిఖీ చూచుకున్నాడు. అన్నీ సరిగ్గా వున్నాయన్న నిర్ణయానికి వచ్చిన తర్వాత తన అనుమానానికి తనే నవ్వుకున్నాడు.

రోజులు గడచిపోతున్నాయి. ఒకానొక అపరసంజవేళ వచ్చి, వేకువజామున్నే వెళ్ళిపోయిన అతిథిని, శేఖరం ప్రధాన కథతో ఎంతమాత్రమూ సంబంధంలేని 'గెస్ట్ ఆర్టిస్ట్' గా మాత్రమే భావించాడు.

వారం రోజుల తర్వాత ఒరోజు వుదయాన పోస్టుమెన్ వీధిలోంచి కేకవేసి ఒక కవరును లోపలికి విసరివేసి, వెళ్ళిపోయాడు.

'ఇదిగో శేఖరం! ఉత్తరం వచ్చింది' అంటూ కవరును కుమారుడి చేతికిచ్చి, అతడింకా దాన్ని తెరచి తెరవకముందే 'ఎక్కడినుంచి వచ్చింది' అని ప్రశ్నించింది కామాక్షమ్మ.

నింపాదిగా ఉత్తరం చదువుతూ శేఖరం 'సుబ్బరామయ్యగారు వ్రాశారు' అన్నాడు.

'చదువు ఏంవ్రాశారు?'

ఈ విషయంలో తల్లికున్న ఆతురత ఏలాటిదో శేఖరానికి తెలుసు. అందుచేత అతడామెకు ఉద్వేగం కలిగించకుండా ఉత్తరాన్ని ఆదినుంచి అంత్యందాకా అక్షరంవిడిచి పెట్టకుండా చదివేశాడు.

'చిరంజీవి శేఖరాన్ని ఆశీర్వదించి సుబ్బరామయ్య వ్రాయుజాబు

చిరంజీవుల వివాహాన్ని గురించి మనమొక నిర్ణయానికి వచ్చి చాలారోజులైంది. నిజానికి ఈ పెళ్ళి నా యిష్టప్రకారమే గనుక జరిగివుంటే యింతకుమునుపెప్పుడో జరిగి వుండవలసింది. కానీ యిందులో అబ్బాయి అభిప్రాయం, నా అభిప్రాయంకన్నా చాలా ముఖ్యమైంది గావడంచేత, ఒకసారి వాడిని మీవూరికి పంపి ఆ తరువాత నిర్ణయానికి రాదలచుకున్నాను. అందువల్ల యింత ఆలస్యం జరిగింది.

ఈజాబుతో బాటు మావాడు నాకు వ్రాసిన వుత్తరాన్ని జతచేసి పంపుతున్నాను. దాన్ని చదువుకున్నట్టయితే నీకన్ని విషయాలు బోధపడగలవు.

ఇట్లు,

సుబ్బరామయ్య

శేఖరం ఆ రెండో వుత్తరాన్ని యిలా చదివి ముగించాడు.

'రాజశ్రీ నాన్నగారికి; శ్రీధరం నమస్కారములు.

క్షేమం. మీ క్షేమం తెలుపవలెను. దాదాపు అయిదారు మాసాలనుంచీ మీరు నన్ను ఉలవపాడుకు వెళ్ళి, అమ్మాయిని చూచిరమ్మని చాలాసార్లు హెచ్చరించారు. ఈ

సందర్భంలో ఒకమాట చెబుతున్నందుకు మన్నించండి. నాకు పెళ్ళిచూపుల ప్రహసనమంటే బొత్తిగా గిట్టదు. మానవుడి విలువను తెచ్చికోలు ఆకర్షణల్నిబట్టి, పైపై మెరుగుల్ని బట్టి గాక, అతడి సహజ స్వభావాన్ని బట్టి నిర్ణయించడం సబబని నా అభిప్రాయం. ఫలానా రోజు వస్తున్నామని మనం జాబు వ్రాయడం, ఆవేళకక్కడ వేషభూషణాద్యలంకారాలతో అటువైపు వారు సిద్ధంగా వుండడం, మనం వెళ్ళగానే ఎక్కడలేని మర్యాదలూ, మన్ననలూ- ఈ హంగామాలో సహజ వాతావరణం ద్యోతకం కాదనీ సహజ స్వభావాలు వ్యక్తం కావనీ మీకు ప్రత్యేకించి చెప్పనవసరంలేదు.

ఇందుచేత నేనొక చిన్న తప్పిదాన్ని చేయవలసి వచ్చింది. మన్నించండి క్షంతవ్యుణ్ణి!

గడచిన సోమవారంనాడు ఉలవపాడు వెళ్ళాను. రెండుమైళ్ళ దూరంలో బస్సుదిగి కాలినడకతో ఆవూరు చేరుకునేసరికి బాగా చీకటి పడిపోయింది. వెదుకబోయిన తీగ కాలికి తగిలినట్టు, మున్ముందుగా శేఖరంగారే వూరిబయట కనిపించారు. రెండుమూడేళ్ళకు పూర్వం నేను ఒక పెళ్ళి సందర్భంలో ఆయన్ను చూచివున్నందువలన గుర్తుపట్టగలిగాను! అదృష్టవశాత్తు ఆయన నన్ను పోల్చుకోలేకపోయాడు.

ఆ రాత్రి పూట శేఖరంగారి యింట్లో, అపరిచితుడి హోదాలోనే అనుకోండి నాకు ఆతిథ్యం లభ్యమైంది.

నేను చూచినంతలో ఆ యిల్లూ, దాని పరిసరాలు, శుభ్రంగానే వున్నాయి. నాకు అనుభవమైనంతలో భోజనం రుచిగా శుచిగా వుంది. ఒక అపరిచితుడిపట్ల వాళ్ళు కనబరచిన ఆదరణకు నామట్టుకు నేను ముగ్ధుడినైపోయాను. ఇక అమ్మాయిని గురించి; మామూలు దుస్తుల్లోనే ఆమె అందంగా వున్నట్టు గోచరించింది. ఆమెలో ఏకోశానా వెకిలితన మున్నట్టు నేను పసికట్టలేకపోయాను. మరొక విషయం. అమ్మాయి ఒక మాదిరిగా పాడుతుందిగూడా! జోలపాట పాడుతుంటే విన్నాను. ఆపాట మధురాతి మధురంగావుందని ఉత్ప్రేక్షించను గానీ, యింతకు మునుపెన్నిసార్లో రిహార్సల్ చేసుకుని పెళ్ళిచూపుల సందర్భంలో అప్పగించే కృతికన్నా శ్రావ్యంగా వుందని మాత్రం చెప్పగలను.

ఇట్లు,

మీ కుమారుడు శ్రీధరం

'అవురా, ఎంతచోద్యమమ్మా!' అన్నటుగా కామాక్షమ్మ ముక్కమీద వ్రేలేసుకుని విగ్రహంలా నిల్చుండిపోయింది.

(... తెలుగు సంక్రాంతి)

❀ ❀ ❀